క్లుప్తంగా

నేడు నేత్ర వైద్యశిబిరం

స్టేషన్‌ఘన్‌పూర్: తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్, స్థానిక లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో హనుమకొండ శరత్ మ్యాక్స్ విజన్ వారిచే శివునిపల్లిలో గురువారం ఉచిత నేత్ర వైద్యశిబిరాన్ని నిర్వహించనున్నట్లు రిటైర్డ్ ఉద్యోగుల సంఘం మండల శాఖ అధ్యక్షుడు ఎండీ.దస్తగిరి ఒక ప్రకటనలో తెలిపారు. శివునిపల్లిలో సేయింట్ థామస్ హైస్కూల్ సమీపాన దస్తగిరి నివాసంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ శిబిరం నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. పరీక్షల అనంతరం అవసరమున్న వారికి హనుమకొండలోని ఆస్పత్రిలో ఆపరేషన్ చేస్తామని తెలిపారు. నేత్ర వైద్య శిబిరానికి వచ్చే వారు తమ ఆధార్‌కార్డు తీసుకుని రావాలని, పూర్తి వివరాల కోసం 9704104472 నంబర్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు.

హనుమాన్ మాలధారుల పూజలు



చిల్పూరు: మండలంలోని శ్రీపతిపల్లి గ్రామంలో బుధవారం హనుమాన్ మాలధారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కిషన్ ఆధ్వర్యంలో స్వాములకు అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో రంగు హరీష్, మా, శ్రీను, శీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

నివాళి



కొడకండ్ల: ఈజీఎస్ రాష్ట్ర డైరెక్టర్ అందె యాకయ్య తండ్రి మల్లయ్య మృతి బాధాకరమని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. మల్లయ్య మృతి సమాచారం తెలుసుకున్న దయాకర్‌రావు కొడకండ్లకు చేరుకొని మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. జెడ్పీ ఫ్లోర్ లీడర్ శ్రీనివాస్, ఎంపీపీ జ్యోతి, మార్కెట్ చైర్మన్ రాము, మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు సిందె రామోజీ, యూత్ అధ్యక్షుడు సతీష్‌గౌడ్, ఆసీఫ్, సత్యనారాయణ, శ్రీనునాయక్ ఉన్నారు.

కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రాజిరెడ్డి మృతి



రాజిరెడ్డి (ఫైల్)

దేవరుప్పుల: మండల కేంద్రానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు గోలి రాజిరెడ్డి(75) బుధవారం మృతి చెందాడు. ఆయన మృతదేహంపై కాంగ్రెస్ పార్టీ మండల్ల అధ్యక్షుడు నల్ల శ్రీరాములు, మాజీ మండల అధ్యక్షుడు, పీఏసీఎస్ డైరెక్టర్ పెద్ది కృష్ణమూర్తి ఆధ్వర్యంలో వేర్వేరుగా పాల్గొని పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. సీనియర్ నాయకులు పీఏసీఎస్ మాజీ చైర్మన్ కాసారపు ధర్మారెడ్డి, చిలుకూరి నర్సయ్య, గ్రామ పార్టీ అధ్యక్షుడు ఉప్పుల ఉప్పలయ్య, రెడ్డిరాజుల రమేష్, చెల్మారెడి, కారుపోతుల పాపయ్య, తోటకూరి రమేష్, పాండు, యాకస్వామి, మండల యూత్ అధ్యక్షుడు ఉప్పుల అనిల్, కోల ఐలయ్య, గౌడిశాల శ్రీను, బాబు, సంతోష్, ఉమేష్, రాజు తదితరులు ఉన్నారు.

పిల్లలకు అవగాహన కల్పించాలి



కాజీపేట: పిల్లలపై జరుగుతున్న లైంగిక వేధింపులను ఎదురించేలా వారికి అవగాహన కల్పించాల్సిన అవసరాన్ని తల్లిదండ్రులు గుర్తించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కవిత అన్నారు. కాజీపేట 61వ డివిజన్ ప్రశాంత్‌నగర్ కాలనీలో సఖి వన్‌స్టాప్ కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన మహిళా అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. పిల్లల రక్షణ కోసం ప్రభుత్వం ప్రత్యేకమైన చట్టం ప్రివెన్సన్ ఆఫ్ చిల్డ్రన్ ఫ్రమ్ సెక్సువల్ యాక్ట్ గురించి వివరించారు. ఈ చట్టాన్ని బాధితులు వినియోగించుకోవాలని సూచించారు. సమావేశంలో వినీల, స్వర్ణలత, సునీత దేవి, శ్వేత తదితరులు పాల్గొన్నారు.

మెగా రక్తదాన శిబిరం

ఖిలా వరంగల్: వరంగల్ రంగశాయిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో వాగ్బాట యోగా అండ్ వాకర్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు పెరుమాండ్ల మధుసూదన్ ఆధ్వర్యంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సంస్థ హనుకొండ నేతృత్వంలో బుధవారం మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు పెసరు నిరంజన్‌రెడ్డి హాజరై రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు.

స్విమ్మింగ్‌పూల్‌ను తలపిస్తున్న రహదారి

- రోడ్డుపై భారీగా నిలిచిన వర్షపు నీరు
- పట్టించుకోని ఆర్‌అండ్‌బీ అధికారులు
- జిల్లా కలెక్టర్‌కు పొరుడి ఫిర్యాదు



రఘునాథపల్లి-కంచనపల్లి రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

రఘునాథపల్లి: రఘునాథపల్లి బస్టాండ్ సమీపంలోని కంచనపల్లి రహదారి వద్ద భారీగా వర్షపు నీరు నిలిచి స్విమ్మింగ్‌పూల్‌ను తలపిస్తోంది. దీంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. నీళ్లలోంచి రాక పోకలు సాగిస్తూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బుధవారం స్థానికుడు ఠాకూర్ గణేష్‌సింగ్ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. వర్షపు నీరు నిల్వ కుండా తగు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రోడ్డు నిర్మాణ సమయంలో ఆర్‌అండ్‌బీ అధికారుల పర్యవేక్షణ లేక కాంట్రాక్టర్ ఇష్టానుసారంగా రోడ్డు వేయడంతో భారీగా వర్షపు నీరు నిలిచిపోవడంతో నీళ్లలోంచి వెళ్లాల్సిన దుస్థితి నెలకొందని, ఇందుకు బాధ్యులైన అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు. రహదారిపై వర్షపు నీరు నిలుస్తుందని పలు మార్లు కోరినా ఆర్‌అండ్‌బీ అధికారులు పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. తమ ఫిర్యాదుకు కలెక్టర్ సానుకూలంగా స్పందించారని గణేష్‌సింగ్ తెలిపారు.

మహనీయుడు అంబేడ్కర్

జఫర్‌గఢ్: దేశానికి గొప్ప రాజ్యాంగాన్ని అందించిన మహనీయుడు బీఆర్ఎస్ అంబేడ్కర్ అని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మంచాల ఎల్లయ్య అన్నారు. మండలంలోని సాగరం గ్రామంలో అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు బుధవారం ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విగ్రహ ఏర్పాటుకు అందరూ ముందుకు రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో దళిత సంఘం నాయకులు బొజ్జు బిక్షపతి, మాజీ సర్పంచ్ వట్టి ఇన్నారెడ్డి, లోనే నాగేశ్వర్, పిన్నింటి రాజు, కైరిక మల్లయ్య, యువరాజు, తాటికాయల చేతన్ గ్రామస్తులు పాల్గొన్నారు.



భూమి పూజలో ఎల్లయ్య తదితరులు

బాధితుడికి ఆర్థికసాయం

స్టేషన్‌ఘన్‌పూర్: రైలు ప్రమాదంలో రెండు కాళ్లను కోల్పోయిన ఘన్‌పూర్‌కు చెందిన బాధితుడు సాంబారి శ్రీనివాస్‌కు స్థానిక పద్మశాలి పరపతి సంఘం తరఫున తమవంతుగా మానవతా దృక్పథంతో రూ.52వేలు సాయంగా అందజేశారు. ఈమేరకు పరపతి సంఘం అధ్యక్షుడు పిట్టల లక్ష్మీనారాయణ చేతుల మీదుగా సదరు డబ్బును బుధవారం బాధితుడికి అందించారు. ముందుగా బాధితుడిని పరామర్శించి తమ సానుభూతి తెలిపారు. సంఘం ప్రధాన కార్యదర్శి సాంబారి సత్యనారాయణ, కోశాధికారి గుండు రమేష్, సభ్యులు వేళ్ళ సురేందర్, గద్దం కృష్ణమూర్తి, బొద్దున రవి, కూరపాటి యాదగిరి, కూరపాటి శ్రీనివాస్, రాజ్‌కుమార్, రామస్వామి, గుండు మీనాక్షి, పిట్ట ప్రకాష్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.



ఆర్థికసాయం అందజేస్తున్న సంఘం బాధ్యులు

రికార్డులు సక్రమంగా నిర్వహించాలి

బచ్చన్నపేట: అంగన్‌వాడీ కేంద్రాల్లోని రికార్డులను సక్రమంగా నిర్వహించాలని ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు సూచించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి బుధవారం అంగన్ వాడీ కేంద్రాల తనిఖీ కార్యక్రమంలో భాగంగా రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ లక్ష్యాన్ని అంగన్‌వాడీ టీచర్లు నెరవేర్చాలని, కేంద్రాల్లో పిల్లల హాజరు శాతం మరింత పెంచాలన్నారు. ప్రతి కేంద్రంలో పౌష్టికాహారం సకాలంలో అందేలా చూడాలని, పూర్తి సమాచారం అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జీపీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న కార్యదర్శి అనిల్‌రాజ్

సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలి

బచ్చన్నపేట: మండలంలోని గ్రామాల్లో ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలని ఎంపీడీఓ రఘురామకృష్ణ అన్నారు. బుధవారం ఆయన పలు గ్రామాల్లో పర్యటించి మాట్లాడారు. సర్పంచ్‌ల పదవీ కాలం ముగియడంతో ప్రత్యేక పాలన కొనసాగుతున్న నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట అధికారులు తదితరులు ఉన్నారు.

నిత్యావసర సరుకుల అందజేత



నిత్యావసరాలు అందజేస్తున్న అసోసియేషన్ సభ్యులు

తరిగొప్పుల: మండలంలోని అక్కరాజుపల్లి గ్రామానికి చెందిన బొంత లచ్చవ్వ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. కాగా బాధిత కుటుంబసభ్యులను రెయిన్‌బో యూత్ సభ్యులు బుధవారం పరామర్శించి 25 కేజీల బియ్యం, 5 కేజీల వంట నూనె అందజేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు అంకం రాజు, అక్తర్, జొన్నగోని రాజు, తరుణ్, సాంబరాజు తదితరులు ఉన్నారు.

కడియం కావ్యను కలిసిన కాంగ్రెస్ నాయకులు



చిల్పూరు: కాంగ్రెస్ పార్టీ వరంగల్ ఎంపీ అభ్యర్థి కడియం కావ్యను మండలంలోని రాజవరం గ్రామానికి చెందిన ఆ పార్టీ నాయకులు బుధవారం మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా సోమవారం జరిగిన ఎన్నికలపై చర్చించారు. జక్కుల రాజయ్య, బత్తుల సూర్యనారాయణ, ఎడ్ల కర్ణాల యాదగిరి, నల్ల ఎల్లయ్య, ఎడ్ల శ్రీనివాస్, వెంకటయ్య, బైరగోని ఎల్లయ్య తదితరులు ఉన్నారు.

మండలాల వారీగా పోలింగ్



స్టేషన్‌ఘన్‌పూర్‌లో ఓటుహక్కు వినియోగించుకునేందుకు బారులుదీరిన ఓటర్లు(ఫైల్)

స్టేషన్‌ఘన్‌పూర్: ఈనెల 13న జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గం నుంచి మొత్తంగా 78.77 శాతం పోలింగ్ జరుగగా అందులో లింగాలఘన్‌పూర్ మండలం నుంచి అత్యధికంగా 80.63 శాతం, అత్యల్పంగా స్టేషన్‌ఘన్‌పూర్ మండలం నుంచి 76.75 శాతం పోలింగ్ జరిగింది. ఘన్‌పూర్ నియోజకవర్గంలో జనగామ జిల్లా నుంచి స్టేషన్‌ఘన్‌పూర్, చిల్పూరు, జఫర్‌గఢ్, రఘునాథపల్లి, లింగాలఘన్‌పూర్ మండలాలుండగా హనుమకొండ జిల్లా నుంచి ధర్మసాగర్, వేలేరు మండలాలతో పాటు ఐనవోలు మండలం నుంచి రెండు గ్రామాలు, కాజీపేట మండలం నుంచి ఒక గ్రామం ఘన్‌పూర్ నియోజకవర్గంలో ఉంటాయి. మండలాల వారీగా పోలింగ్ శాతం వివరాలు ఇలా ఉన్నాయి. చిల్పూరు (80.60 శాతం), ధర్మసాగర్ (78.70), స్టేషన్‌ఘన్‌పూర్ (76.75), లింగాలఘన్‌పూర్(80.63), రఘునాథపల్లి(78.94), వేలేరు (77.72), జఫర్‌గఢ్(78.06), ఐనవోలు(80.67), కాజీపేట మండలంలో77.33 శాతం పోలింగ్ జరిగింది.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



గాయపడిన మంజుల

స్టేషన్‌ఘన్‌పూర్: రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ప్రమాదంలో తుప్పుడు రమేష్, మంజుల దంపతులు గాయపడిన సంఘటన ఘన్‌పూర్ శివారులోని కొత్తపల్లి క్రాస్‌రోడ్డు వద్ద బుధవారం రాత్రి జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. గండి రామారం గ్రామానికి చెందిన తుప్పుడు రమేష్, మంజుల వ్యక్తిగత పనులపై స్టేషన్‌ఘన్‌పూర్‌కు తమ బైక్‌పై వచ్చి తిరిగి వెళ్తున్న క్రమంలో కొత్తపల్లి క్రాస్‌రోడ్డు వద్ద ఎదురుగా వస్తున్న మరో బైక్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రమేష్, మంజుల రోడ్డుపై పడగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు పోలీసులకు, 108 అంబులెన్స్ వారికి ఫోన్ చేస్తే స్పందన లేదు. దాదాపు గంటపాటు చూసి బాధితులను స్థానికులు చికిత్స నిమిత్తం ప్రైవేటు ఆటోలో జనగామకు తరలించారు.

కారు ప్రమాదంలో ఎంపీటీసీకి..

బచ్చన్నపేట: మండలంలోని ఇటుకాలపల్లి గ్రామ ఎంపీటీసీ, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు దూడల కనకయ్యకు కారు ప్రమాదంలో స్వల్ప గాయాలు అయిన సంఘటన బుధవారం జరిగింది. వివరాలు.. కనకయ్య తన కూతురును పోటీ పరీక్ష రాయించడానికి కారులో హైదరాబాద్‌కు తీసుకెళ్లాడు. పరీక్ష అనంతరం ఇద్దరు తిరుగు ప్రయాణమయ్యారు. జగదేవపూర్ సమీపంలోని వరదరాజపురం వద్దకు రాగానే ప్రమాదవశాత్తు కారు అదుపు తప్పి రోడ్డుపక్కన ఉన్న చెట్టును ఢీకొనగా నుజ్జునుజ్జు అయింది. ఈ ఘటనలో ఎంపీటీసీ కనుకయ్యకు గాయాలు కాగా గజ్వేల్‌లోని ఆర్‌వీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న టీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు బొడిగం చెంద్రారెడ్డి, పలువురు నాయకులు ఆస్పత్రికి వెళ్లి ఆయనను పరామర్శించారు.



బచ్చన్నపేట: ప్రమాదంలో నుజ్జునుజ్జు అయిన కారు

రైల్వే సంఘ్ డిప్యూటీ డివిజన్ సెక్రటరీగా చింత మురళి

కాజీపేట రూరల్: కాజీపేటకు చెందిన రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ నాయకుడు చింత మురళికి సికింద్రాబాద్ డివిజన్ కమిటీలో కీలక పదవి లభించిందని రైల్వే సంఘ్ నాయకులు బుధవారం తెలిపారు. సికింద్రాబాద్‌లో జరిగిన సంఘ్ వర్కింగ్ కమిటీ సమావేశంలో మురళికి ఈ అవకాశాన్ని డివిజన్ నాయకులు కల్పించారు. కాజీపేట మెయిల్ ఎక్స్‌ప్రెస్ లోకో పైలట్‌గా పనిచేస్తూ సంఘ్ సీడబ్ల్యూసీ సభ్యుడిగా ఉన్న చింత మురళిని సికింద్రాబాద్ డిప్యూటీ డివిజన్ సెక్రటరీగా నియమించినట్లు వివరించారు. ఈ మేరకు రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ కార్యాలయంలో ఆయనను బుధవారం రాత్రి రైల్వే సంఘ్ నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో రైల్వే సంఘ్ నాయకులు సాధినేని వెంకటనారాయణ, కె.రవి, పాక రాజ్‌కుమార్, నర్సింగరావు, బల్విందర్ సింగ్, బి.మాధవరావు, జగదీశ్వర్, మధుసూదన్‌రావు, అభిలాష్, కాంగ్రెస్ నాయకుడు ఎం.డి.అంకూస్ పాల్గొన్నారు.



మురళిని సన్మానిస్తున్న నాయకులు

నరేంద్ర దబోల్కర్ హత్య కేసులో సూత్రధారులను శిక్షించాలి

పాలకుర్తి టౌన్: ప్రముఖ హేతువాది, మానవతావాది డాక్టర్ నరేంద్ర దబోల్కర్‌ను హత్య చేసిన సంఘటనలో దుండగులను కఠినంగా శిక్షించాలని భారత నాస్తిక సమాజం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి గుమ్మడి రాజుల సాంబయ్య డిమాండ్ చేశారు. బుధవారం ఆయన పాలకుర్తిలో విలేకరులతో మాట్లాడారు. 2013 ఆగస్టు 20న మహారాష్ట్రలోని ఓంకారేశ్వర బ్రిడ్జిపై వాకింగ్ చేస్తున్న నరేంద్రను సంఘ్ పరివార్ గుండాలు అత్యంత పాశవికంగా కాల్చి చంపిన వారిని పూణెలోని ప్రత్యేక కోర్టు సచిన్ అందూలే, శరత్ కళాస్కర్లకు యావజ్జీవ కఠిన కారాగార శిక్ష విధిస్తూ కోర్టు కీలక తీర్పు ఇచ్చిందన్నారు. కీలక సూత్రదారులైన వీరేంద్ర తలాకే, అడ్వకేట్ సంజీవ పునలేకర్, విక్రమ్ భావేలను నిర్దోషులుగా విడుదల చేసింది. వారిపై నేరాన్ని నిరూపించడంలో దబోల్కర్ తన మరణానంతరం అక్కడి ప్రభుత్వం మూఢ నమ్మకాల నిర్మూలన చట్టం చేసిందని సాంబయ్య అన్నారు.

‘డబుల్’ ఇళ్ల పంపిణీ ఎప్పుడో..?

చిల్పూరు: చిల్పూరు మండలం పల్లగుట్ట గ్రామంలో నిలువ నీడలేని వారి కోసం నిర్మాణాలు పూర్తి చేసుకున్న డబుల్ బెడ్రూం ఇళ్ల పంపిణీ ఎప్పుడో అని ఆరు ఏళ్లుగా అర్హులు ఎదురుచూస్తున్నారు. 2017లో రూ. 188.70 లక్షలతో రెండు పడకల గదుల నిర్మాణ పనులకు అప్పటి ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్య శంకుస్థాపన చేశారు. అవి పూర్తి అయినప్పటికీ పంపిణీలో జాప్యం జరుగుతుండడంతో ఇళ్లు లేని పేదలు ఇబ్బంది పడుతున్నారు. ప్రస్తుతం ఆ ఇళ్లు పేకాట, మద్యం బాబులకు నిలయాలుగా మారాయి. ఇక చిల్పూరు మండల కేంద్రంలో 40 మందిని గుర్తించి వారికోసం రెండు పడక గదుల నిర్మాణం కోసం 2019 డిసెంబర్ 29న శంకుస్థాపన చేశారు. కానీ ఇప్పటి వరకు పనులు మొదలు పెట్టకపోవడంతో ఎప్పుడు నిర్మించి ఇస్తారని లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారు.



పంపిణీ చేయని డబుల్ ఇళ్లు

కూలక ముందే పేదలకు అందజేయాలి



గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో గూడు లేని వారికి డబుల్ బెడ్రూం ఇళ్లను నిర్మించారు. ప్రస్తుతం చిన్న వర్షానికి ఉరుస్తున్నాయి. కూలక ముందే ఇళ్లను పేదలకు అందించాలి.

– బాల్నె శ్రీనివాస్ , బీజేపీ ఓబీసీ జిల్లా అధ్యక్షుడు

అర్హులకు మంజూరు చేయాలి



మండల కేంద్రంలో డబుల్ బెడ్రూం ఇళ్ల కోసం అప్పటి ఎమ్మెల్యే రాజయ్య శంకుస్థాపన చేసి 5 ఏళ్లు దాటింది. ఇప్పటికీ పనులు మొదలు కాలేదు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి నిరుపేదలను గుర్తించి ఇళ్లు మంజూరు చేయాలి.

– తోట శ్రీనివాస్

శ్వేతార్కలో గణనాథుడి కల్యాణం



కాజీపేట: కాజీపేట స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రంలోని సిద్ధి, బుద్ధి సమేత గణనాథుడికి పండితులు వివాహ వేడుకలు జరిపించారు. వసంతోత్సవ వేడుకల్లో భాగంగా ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు అయినవోలు వెంకటేశ్వర్లు శర్మ ఆధ్వర్యంలో అర్చకులు, పండితులు బుధవారం కల్యాణం నిర్వహించారు. వధూవరుల పక్షాన రాధాకృష్ణ శర్మ, సాయికృష్ణశర్మ నిలిచి వివాహం జరిపించి భక్తులకు తీర్థప్రసాదాల వితరణ చేశారు. కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్, రమ దంపతులతో పాటు గంగుల రాజిరెడ్డి, వెంకటేశ్వర్లు శర్మ, మణిదీప్, రవి, సుధీర్ పాల్గొన్నారు.

నూతన పీఆర్‌సీ అమలు చేయాలి

హన్మకొండ: పెరుగుతున్న ధరలకు అనుగుణంగా నూతన వేతన సవరణను అమలు చేయాలని పీఆర్టీయూ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి పులి దేవేందర్ ముదిరాజ్ డిమాండ్ చేశారు. హనుమకొండలోని సంఘం కార్యాలయంలో ఉమ్మడి వరంగల్ జిల్లా ముఖ్య నాయకుల సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023, జూలై 1 నుంచి నూతన పీఆర్‌సీ అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న కరువు భత్యం చెల్లించాలని సూచించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన పీఆర్ఎస్ కమిటీ రాష్ట్రంలోని అన్ని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలను ఆహ్వానించడం సంతోషకరమన్నారు. ఇది చర్చల వరకే పరిమితం కాకుండా త్వరగా ప్రభుత్వానికి నివేదిక అందజేయాలని కోరారు. పీఆర్టీయూ జయశంకర్ జిల్లా అధ్యక్షుడు రాచర్ల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పసుల శంకర్ మాట్లాడుతూ ఈ వేసవిలోనే ఉద్యోగ, ఉపాధ్యాయ బదిలీలు చేపట్టాలని, ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా సీపీఎస్‌ను రద్దు చేసి, ఇది ఉద్యోగుల ప్రభుత్వం అని రుజువు చేసుకోవాలని అన్నారు. సమావేశంలో పీఆర్టీయూ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు పున్నంచందర్, మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు వల్లబోజు సుధాకర్, రాష్ట్ర నాయకుడు బోడ రాంజీ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పులి దేవేందర్

రాధాకృష్ణుల ఆలయ వార్షికోత్సవం

కాజీపేట: కాజీపేట మండలం సోమిడి గ్రామంలో రాధాకృష్ణుల దేవాలయంలో వార్షికోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. పూజారి అయినవోలు సాయికృష్ణశర్మ ఆధ్వర్యంలో రాధాకృష్ణుల విగ్రహాలకు అర్చనలు, అభిషేకాలతో పాటు ప్రత్యేక అలంకరణ పూజలు జరిపించారు. శ్వేతార్క ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకుడు రాధాకృష్ణశర్మ భక్తులతో గణపతి హోమం చేయించారు. రాధాకృష్ణుల వేషధారణలతో చిన్నారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. స్థానిక కార్పొరేటర్ రవీందర్ యాదవ్ – రమ దంపతులు కుటుంబ సభ్యులతో కలిసి ఆంజనేయస్వామి మాలధారులతో పాటు భక్తులకు మహాన్నదానం చేశారు.

సుందరయ్య ఆశయ సాధనకు కృషి

కాజీపేట అర్బన్: కమ్యూనిస్టు నాయకుడు కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య ఆశయ సాధనకు కృషి చేద్దామని సీపీఎం నాయకుడు జంపాల మురళి అన్నారు. కాజీపేట మండలం న్యూశాయంపేటలోని కందుల బండ ప్రాంతంలో సీపీఎం ఆధ్వర్యంలో పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతిని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మురళి మాట్లాడుతూ సుందరయ్య జీవితాన్ని నేటి యువత ఆదర్శంగా తీసుకుని పోరాటాలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో జాటోతు విజయ్, సాంబయ్య, రమేష్, మదన్, సురేష్, రాజేశ్వరి, కోమల, కల్పన తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న నాయకులు

కాంగ్రెస్‌కు పెరుగుతున్న ప్రజాదరణ

బచ్చన్నపేట: రాష్ట్రంలో అధికార కాంగ్రెస్ పార్టీకి ప్రజాదరణ పెరుగుతోందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు నూకల బాల్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ ఆరు గ్యారంటీలను అమలు చేస్తూ ప్రజాపాలన అందిస్తున్న కాంగ్రెస్ పార్టీని ప్రజలు ఎంతగానో ఆదరిస్తున్నారని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో భువనగిరి అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డికి భారీ మెజార్టీ రావడం ఖాయమన్నారు. త్వరలో జరగనున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకే పట్టం కట్టనున్నారని తెలిపారు. వరంగల్, ఖమ్మం–నల్గొండ జిల్లాల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ తరఫున తీన్మార్ మల్లన్న అభ్యర్థిగా పోటీ చేస్తున్నారని, విద్యావంతులు ఆయనకు పట్టంకట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు జంగిడి విద్యానాథ్, మాసపేట రవీందర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డితోపాటు తదితరులు పాల్గొన్నారు.